

ఉద్యానవన శాఖ బృందం పర్యటన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని గత్తుం పంచాయతీ మారుమూల గ్రామంలో ఉద్యానవన శాఖకు చెందిన ప్రముఖ అధికారుల బృందం పర్యటించింది. ఉద్యానవన శాఖ అదనపు డైరెక్టర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ (పిఓ) ఎం. వెంకటేశ్వరులు, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ పుల్లా రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ రమేష్, జిల్లా ఉద్యానవన శాఖ సంచాలకులు ఎ. రమేష్ కుమార్ జంగం పుట్టులో శుక్రవారం సందర్శించారు. చుట్టుపక్కల ఏడు గ్రామాలలో వ్యవసాయ అభివృద్ధికి అవకాశాలను గుర్తించడానికి సందర్శించి, వారు పండిస్తున్న పంటలను పరిశీలించారు. గ్రామ రైతులతో సంభాషించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక పరిస్థితులను అంచనా వేశారు. ఈ యొక్క కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.


హాజరైన అధికారులు

సమస్యలను పరిష్కరించాలి

- సిహెచ్‌డబ్ల్యూల ఆందోళన



ధర్నా చేస్తున్న సిహెచ్‌డబ్ల్యూలు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: సిహెచ్‌డబ్ల్యూల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎ కార్యాలయం గేటు ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో సిహెచ్‌డబ్ల్యూలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిహెచ్‌డబ్ల్యూల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. అల్లూరి జిల్లా పాడేరు డివిజన్ లో 720 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఉన్నారని, వారిని ఆశాలుగా మార్చాలని డిమాండ్ చేశారు. అలాగే రూ.10వేలు వేతనం ఇవ్వాలని, యూనిఫామ్, సెల్ ఫోన్, మెడికల్ కిట్లు అందజేయాలన్నారు. సిహెచ్ డబ్ల్యూలు, ఆశా వర్కర్ల పనికి వ్యత్యాసం లేనప్పటికీ వేతనాల్లో వ్యత్యాసం ఉందన్నారు. సిహెచ్ డబ్ల్యూలకు రూ.4వేలు, ఆశలకు రూ.10వేలు వేతనం ఇస్తున్నారని తెలిపారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలతో చాలీచాలని వేతనంతో సిహెచ్ డబ్ల్యూలు ఎలా బతకాలని ప్రశ్నించారు.
ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దాసమ్మ మాట్లాడుతూ, సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కొనసాగిస్తామని అన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేశారు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.సుందరరావు మాట్లాడుతూ, సిహెచ్‌డబ్ల్యూల సమస్యలపై గతంలో పది రోజులు ఐటిడిఎ ముందు రిలే నిరాహార దీక్షలు చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిందని ఎన్నికల హామీని నెరవేర్చాలని తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చే నెలలో విజయవాడ కేంద్రంగా పెద్ద ఎత్తున చేపట్టనున్న ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి సిహెచ్ డబ్ల్యూల యూనియన్ జిల్లా అధ్యక్షులు పద్మ, ఉపాధ్యక్షులు పార్వతి, కోశాధికారి సరస్వతి, సిహెచ్ డబ్ల్యూలు, తదితరులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

మహనీయుడు.. జ్యోతిరావు పూలే

ప్రజాశక్తి-పాడేరు : మహాత్మా జ్యోతి రావు పూలే అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహానుభావుడు అని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ కొనియాడారు. శుక్రవార జ్యోతి రావు పూలే 198 జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. పూలే చిత్ర పటానికి కలెక్టర్ పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళ ల అభ్యున్నతి కోసం కృషి చేసి తన జీవితాన్ని ధారా పోసిన మహాత్ముడు అని అన్నారు. దిగువ కులాల ప్రజలకు సమాన హక్కు పొందటానికి సత్య శోధక్ సమాజ్(సొసైటీ అఫ్ స్పీకర్స్ అఫ్ ట్రూత్) ఏర్పాటు చేసి అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. పూలే మరియు అతని భార్య సావిత్రి భాయి పూలే దేశంలో మహిళా విద్య కు మార్గదర్శకులు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె. పద్మలత, కలెక్టర్ కార్యాలయం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.
జ్యోతి రావు పూలే జయంతి వేడుకలను పాడేరు ఐటిడిఎ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఐటిడిఎ ఇంచార్జ్ ప్రాజెక్ట్ అధికారి ఎం జె అభిషేక్ గౌడ, సహాయా ప్రాజెక్ట్ అధికారులు వి ఎస్ ప్రభాకర్ రావు, ఎం వెంకటేశ్వరరావు జ్యోతి రావు పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. బడుగు బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు.
సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహానికి ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ శ్రీనివాసరెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఈవివి సత్యనారాయణ, ఆర్ఎన్ రామకృష్ణ, ధారాజు శేఖర్ ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, కాంగ్రెస్ నాయకులు కార్య శ్రీనివాసరావు, వానపల్లి అప్పారావు, ఏపీ జెన్కో విద్యుత్ ఉద్యోగులు కాంట్రాక్ట్ కార్మికులు (సిఐటియు) బ్రాంచి అధ్యక్ష కార్యదర్శులు బి లక్ష్మణరావు విష్ణుకుమార్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నేత వెంకట్, చిత్రంలో సురేష్, రాంబాబు

మండలంలో అక్రమంగా మైనింగ్

- గ్రామసభల ఆమోదం లేకుండానే ఏజెన్సీ సంపద లూటీ
- ఉన్నతాధికారుల స్పందించకపోతే ప్రజా పోరాటం
- సిపిఎం జిల్లా నాయకులు వెంకట్, సురేష్

ప్రజాశక్తి-చింతూరు
చింతూరు మండలంలో అక్రమంగా మైనింగ్ నిర్వహణ సాగతోందని, మైనింగ్ మాఫియా విచ్చలవిడిగా లక్షల రూపాయలు విలువ చేసే సంపదను కొల్లగొడుతోందని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పల్లపు వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్ విమర్శించారు. అధికారులకు తెలిసినా ఈ అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవడం లేదన్నారు. శుక్రవారం సిపిఎం కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ ఏజెన్సీలో ఉన్న లక్షల విలువ చేసే సంపదను దోచుకెళ్లడానికి ప్రభుత్వ పెద్దల అండతో మైనింగ్ మాఫియా విజృంభిస్తుందన్నారు. ఏజెన్సీలో పీసా కమిటీలు, గ్రామ సభల ఆమోదం లేకుండానే మండలంలోని గూడూరు, నర్సింగపేట గ్రామాల్లో తెల్లరాయిని తరలిస్తున్నారని తెలిపారు. గ్రామసభల తీర్మానాలు లేకుండా తెల్లరాయి తరలించడానికి అధికారులు ఎలా అనుమతిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల జోక్యం చేసుకొని మైనింగ్ మాఫియాను కట్టడి చేయాలని, ఏజెన్సీలో లక్షలు విలువ చేసే సంపదను ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి ఉపయోగించాలని కోరారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, లేనిపక్షంలో ప్రజా పోరాటం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో చింత రాంబాబు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై మహిళల నిరసన


ధర్నా చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని అంతర్ల గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు ఆందోళన చేపట్టారు. అంతర్ల గ్రామం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ఖాళీ బిందెలతో ర్యాలీగా వెళ్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అంతర్ల గ్రామ మహిళలు మాట్లాడుతూ, గడిచిన నెల రోజుల నుంచి తమ గ్రామానికి తాగునీరు లేదని, కనీసం పంచాయితీ పాలకవర్గం, పంచాయతీ అధికారులు అంతర్ల గ్రామానికి సందర్శించి "సమస్య పరిష్కరిస్తామని చెప్పినా పరిష్కరించిన దాఖలాలు లేవని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి వేసవికాలం సమీపిస్తే భూగర్భ జలాలు అడుగంటి నీటి సరఫరా తక్కువగా ఉందని వారు తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు, పాలకులకు విన్నవించుకున్నా ఫలితం లేదని మహిళలు ఆరోపించారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గం, ప్రజా ప్రతినిధులు స్పందించి అంతర్ల గ్రామానికి తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోకపోతే అల్లూరి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లేందుకు వెనకాడబోమని మహిళలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు

ప్రజాశక్తి- అనంతగిరి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలు పరిసరాల ప్రాంతంలో ఉన్న హెూటల్స్, దుకాణాల యాజమాన్యం ప్లాస్టిక్ వాడవద్దని స్థానిక ఎంపీడీవో ఏవివి. కుమార్, ఇన్‌చార్జ్ తహశీల్దార్ మాణిక్యం, ఆర్ఐ పి.శంకర్రావు సూచించారు. ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిల్ వాడవద్దన్నారు. రెండు లీటర్ వాటర్ బాటిల్ మాత్రమే వాడాలన్నారు. ప్లాస్టిక్ వాడితే యాజమాన్యంపై రూ.2500 నుండి 5000 రూపాయలు జరిమానా విధించక తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జన్ని అప్పారావు. సెక్రటరీ మాధీశ్వరరావు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -పాడేరు: జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత కార్యాలయం పరిధిలో చింతపల్లి బాల సదనంలో కాంట్రాక్ట్ పద్ధతి, ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేయుటకు రెండు ఎడ్యుకేటర్, ఒక మ్యూజిక్ టీచర్ పోస్టుల భర్తీకి 25 నుండి 42 సంవత్సరాల మధ్య వయసుగల మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెలెక్షన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థినిలు డిస్ట్రిక్ట్ వెబ్ సైట్ సందర్శించి అర్హతల మేరకు దరఖాస్తు పూర్తి చేసి అన్నీ ధృవ పత్రాల నఖలు జత చేసి ఈ నెల 19వ తేదీ లోపల కార్యాలయ పని దినములలో జిల్లా మహిళా, స్త్రీ సంక్షేమ మరియు సాధికారిత అధికారిణి, తలారిసింగి, బాలసదనము, పాడేరులో సమర్పించాలని కలెక్టర్ వివరించారు.

ఆర్‌వి.నగర్-పాలగెడ్డ అంతర్రాష్ట్ర రహదారి సమస్యపై
కార్యాచరణకు 13న సమావేశం

ప్రజాశక్తి-సీలేరు
జీకే వీధి మండలం ఆర్‌వి నగర్ నుంచి పాలగడ్డ వరకు అంతర్ రాష్ట్ర రహదారి నిర్మాణ పనులు ప్రభుత్వం, అధికారులు పనులు ప్రారంభించేలా ఒత్తిడి తెచ్చేందుకు భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడానికి ఈ నెల 13న ధారకొండలో సమావేశం ఏర్పాటు చేసినట్లు సిపిఎం గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆర్‌వి నగర్ నుంచి పాలగడ్డ వరకు అంతర్రాష్ట్ర రహదారి అధ్వానంగా ఉన్నప్పటికీ అధికారులు నిర్మాణ పనులు చేపట్టానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జరుగు ఈ సమావేశానికి పార్టీలకు అతీతంగా నాయకులు, అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు. భవిష్యత్తు కార్యాచరణపై ప్రతి ఒక్కరు సూచనలు సలహాలు ఇచ్చి, సమస్య పరిష్కారమయ్యే వరకు ఐక్యంగా పోరాటం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మారుమూల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రహదారుల నిర్మాణాల్లో నిర్దిష్ట విధానం ఉండాలి

ప్రజాశక్తి -పాడేరు: రహదారుల నిర్మాణంలో నిర్దిష్టమైన విధానాన్ని అనుసరించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ శాఖ, పి ఐ యు, రహదారులు భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికా రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారుల నిర్మాణానికి ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని, కాని ఒక విధానాన్ని అమలు చేయడం లేదని అన్నారు. రహదారుల నిర్మాణాలు డేటా ఉందా ? అని ఆరా తీసారు. వేసిన రోడ్లకే మళ్లీ ప్రతిపాదనలు పంపిస్తున్నారని చెప్పారు. ప్రతీ రోడ్డు చెక్ చేయలేము కదా రహదారుల నిర్మాణానికి ఒక యాప్ తయారు చేసి యాప్లో ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. వంద మీటర్ల రోడ్డు నిర్మించడానికి మండలానికి ఒక రేటు చెల్లిస్తున్నారు ఎందుకని ప్రశ్నించారు. రహదారుల నిర్మాణాపై చెల్లిస్తున్న జిఎస్‌టి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశం ఇంచార్జి ఐటిడిఏ పిఓ, జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, పర్చువల్ గా రంపచోడవరం పి ఓ కె. సింహ చలం, చింతూరు పి ఓ అపూర్వ భరత్, పిఐయు ఇఇ శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇ ఇలు కె. వేణుగోపాల్, జి.డేవిడ్ రాజు, డి. ఇ.లు, ఎఇలు తదితరులు పాల్గొన్నారు..


మాట్లాడుతున్న కలెక్టర్

సమగ్రంగా సర్వే నిర్వహించాలి

ప్రధాన మంత్రి జన జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ యోజన (పీ ం - జుగా) అమలు చేయడానికి సమగ్రమైన సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. పి ఎం జుగా అమలుపై శాఖల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో పిఎం జుగా అమలుపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పథకాలు గిరిజనులకు సక్రమంగా అందుతున్నది లేనది పరిశీలించాలని పేర్కొన్నారు. జిల్లాలో వెనుకబడిన 521 గ్రామాల్లో పి. ఎం. జుగా కార్యక్రమం అమలుకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. పాడేరు ఐటిడిఏ పరిధిలో 260, రంపచోడవరం 204, చింతూరు ఐటిడిఏ పరిధిలో 57 గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందని స్పష్టం చేసారు. పి ఎం. జుగా పథకంలో గిరిజనులకు పక్కా గృహాలు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి పథకాలు, ఆయుష్మాన్ భారత్ కార్డులు అందిస్తారన్నారు. గ్రామాల్లో రహదారుల నిర్మాణాలు, మొబైల్ కనెక్టివిటీ, ఇంటర్నెట్ సదుపాయం, ఆరోగ్యం, పోషకాహారం, విద్యా సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తారని చెప్పారు. వారం రోజుల్లో సర్వే పూర్తి చేసి నివేధికలు సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో ఐటిడి ఏ ఇంచార్జి ప్రాజెక్టు అధికారి జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ, డి ఆర్ ఓ కె. పద్మలత, ఐటిడి ఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం. వేంకటేశ్వరరావు, వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.

ల్యాప్ టాప్‌ల పంపిణీ

విభిన్న ప్రతిభావంతులైన ముగ్గురు డిగ్రీ విద్యార్థులకు ల్యాప్ టాప్ లను జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేసారు. ఇంటర్మీడియట్ ఆపైబడి చదువుతున్న విభిన్న ప్రతిభావంత విద్యార్థులు టచ్ ఫోన్లకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. శుక్రవారం స్థానిక ఐటిడిఎలో జరిగిన మీకోసం కార్యక్రమం అనంతరం విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో ఈ ల్యాప్ టాప్ లను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో జేసి అభిషేక్ గౌడ, డిఆర్ఓ కె.పద్మలత, ఎపిఒ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

'కిశోర వికాసం'లో ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం


కిశోర వికాసం కార్యక్రమంలో పాల్గొన్న ఐటిడిఎ పిఒ సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ తదితరులు

ప్రజాశక్తి-రంపచోడవరం
ఏజెన్సీలోని కిశోర బాలికలు చదువుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఉన్నతమైన ఉద్యోగాలు పొందాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్ట సింహాచలం పేర్కొన్నారు. రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం జరిగిన కిశోర వికాసం కార్యక్రమానికి పిఒతో పాటు సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ గతంలో పేదవారు చదువుకోవాలనే ఉద్దేశం ఉన్నా అవకాశం ఉండేది కాదని, నేడు ఏజెన్సీ ప్రాంత గిరిజన విద్యార్థుల కోసం ఉచిత భోజనం, వసతి, ఉచిత విద్యను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. ప్రతి బాలికా మంచి చదువులు చదివి మంచిగా స్థిరపడి 25 సంవత్సరాలు దాటిన తర్వాతే పెళ్లి చేసుకోవాలని సూచించారు. 18 ఏళ్లకు ముందు పెళ్లి చేసుకుంటే అనేక శారీరక ఇబ్బందులకు గురికావాల్సి ఉంటుందని చెప్పారు. ఆడ మగ తేడా లేకుండా అందరూ మంచి చదువులు చదివి రానున్న రోజుల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.
సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ మాట్లాడుతూ బాలికలు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలు పొందే విధంగా దృష్టి పెట్టాలని సూచించారు. బాలురుతో సమానంగా అన్ని రంగాల్లో బాలికలు ముందుండాలన్నారు. టీనేజీ గర్భాలు నిర్మూలించే బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. బాలికల తల్లిదండ్రులు 21 సంవత్సరాలు నిండకుండా ఎవరికైనా పెళ్లి చేయాలని చూస్తే తిరస్కరించాలని, బాగా చదువుకున్న తర్వాతే పెళ్లి చేసుకుంటానని వారికి తెలియజేయాలని సూచించారు. బాలికలు కొంతమంది అబ్బాయిల మాటలు విని మోసపోవద్దని హితవుపలికారు. ఎవరైనా అబ్బాయిలు వేధిస్తే వెంటనే ఐసిడిఎస్ అధికారులకుగాని, పోలీస్ స్టేషన్లో గాని తెలియజేయాలని కోరారు. పాఠశాలలో ఉన్నప్పుడు ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే ఎయన్‌యంకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ సూచించిన మెనూ ప్రకారం ఆహార పదార్థాలు పెడుతున్నదీ లేనిది, ఉపాధ్యాయులు చదువు ఏ విధంగా చెబుతున్నదీ బాలికలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ సంధ్యారాణి, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రామ తులసి, ప్రధానోపాధ్యాయురాలు జి.నూకరత్నం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన

అడ్డతీగల : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీడీపీవో సిహెచ్.లక్ష్మి ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమం శుక్రవారం జరిగింది. విద్యార్థులు మంచి నడవడికతో మెలగుతూ, చక్కని విద్యాభ్యాసం కొనసాగించాలని సూచించారు. బాలికలు 18ఏళ్ళు నిండకుండా వివాహం చేసుకోరాదని, చక్కాగా చదువుకుని మంచి ఉద్యోగం సంపాదించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది వై.సుధ, పావని, స్వర్ణ కుమారి, మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

చిత్రలేఖనంలో జెడ్‌పి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభినందన సభ శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం గోపాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం గోపాలకృష్ణ మాట్లాడుతూ ఇటీవల విజయవాడ డ్రీమ్ ఆర్ట్స్ వారు నిర్వహించిన జాతీయస్థాయి చిత్రలేఖనంలో నాలుగు బంగారు పతకాలు, నాలుగు వెండి పతకాలు సాధించగా 24 మంది విద్యార్థులు మెరిట్ ప్రశంస పత్రలు పొందినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పతకాలను హెచ్‌ఎం గోపాలకృష్ణ, పాఠశాల కమిటీ చైర్మన్ ఎం శ్రీను, కమిటీ సభ్యులు చేతుల మీదుగా అందజేశారు. అనంతరం శిక్షణ ఇచ్చిన డ్రాయింగ్ ఉపాధ్యాయుడు కొండబాబును ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిఎంసి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల కబడ్డీ పోటీల్లో తృతీయ స్థానం

ప్రజాశక్తి -సీలేరు : రాష్ట్రస్థాయి విద్యుత్ ఉద్యోగులు కబాడీ పోటీల్లో సీలేరు కాంప్లెక్స్ పరిధి సీలేరుకు చెందిన విద్యుత్ ఉద్యోగులు తృతీయ స్థానంలో నిలిచారు. రాష్ట్రస్థాయి విద్యుత్ ఉద్యోగులు కబడ్డీ పోటీలు విజయవాడలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగాయి. నెల్లూరు జిల్లా కృష్ణపట్నం జట్టు ప్రథమ స్థానం, తిరుపతి క్రీడాకారులు ద్వితీయ స్థానం సాధించారు. సీలేరు- రాజమండ్రి జట్లు మధ్య పోటీ జరిగ్గా సీలేరు క్రీడాకారులు చక్కటి ఆటతీరును ప్రదర్శించి 42 పాయింట్లుతో తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి రూ.1100, ట్రోఫీని అందజేశారు. ఈ పోటీల్లో ప్రతిభను కనబరిచిన క్రీడాకారులకు ఉత్తమ పురస్కారాలు అందజేయగా, సీలేరు కబడీ జట్టు కెప్టెన్, ఏపీ జెన్కో ఏడిఈ శ్రీనివాసరావు ఉత్తమ రైడర్ బహుమతిని అందుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో చక్కటి ఆటతీరను ప్రదర్శించి తృతీయ స్థానంలో నిలవడం పట్ల స్పోర్ట్స్ చైర్మన్, ఎపి జెన్‌కో ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్‌రెడ్డి ప్రశంసించారు.


ట్రోఫీతో సీలేరు విద్యుత్ ఉద్యోగులు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు : ఎమ్మెల్యే


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి-రంపచోడవరం
ప్రభుత్వ అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి హెచ్చరించారు. అడ్డతీగల మండలంలో శుక్రవారం ఆమె నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్ భాస్కర్‌తో కలిసి ఆకస్మికంగా పర్యటన చేశారు. రంపచోడవరం, గంగవరం మండలం జడేరు, అడ్డతీగల మండలం ఎల్లవరం, అడ్డతీగల 1, 2 సచివాలయాలు, డి.భీమవరం, రాజవొమ్మంగి మండలం గడువకుర్తి సచివాలయాల్లో తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. కొందరు సిబ్బంది సకాలంలో హాజరు కాకపోవటం, కొందరు కేవలం ఆన్‌లైన్ హాజరు మాత్రమే వేస్తూ రిజిస్టర్‌లో సంతకాలు లేకపోవటంతో అసహనం వ్యక్తం చేశారు. అనంతరం డి.భీమవరం బాలురు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు కాసేపు అన్నం వడ్డించి, వారితో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, డి.భీమవరం ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.బాలురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -పాడేరు, : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరంకు సంబంధించి మొదట త్రైమాసిక జాబ్ మేళా క్యాలెండర్ ను జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ ఆవిష్కరించారు. శుక్రవారం స్థానిక ఐటిడిఎలో జరిగిన మీకోసం కార్యక్రమం అనంతరం జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో జాబ్ మేళా క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 17వ తేదీన అరకు వాలీ గవర్నమెంట్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని, మే నెల 2 వ తేదీన పాడేరు, అదేవిధంగా జూన్ నెల 6వ తేదీన రంపచోడవరంలో ఈ మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలలో అనేక ప్రముఖ కంపెనీలు పాల్గొని వారికి అవసరమైన నిరుద్యోగులను ఎంపిక చేసుకుని ఉపాధి కల్పిస్తారని, అవసరమైతే శిక్షణను కూడా అందిస్తారని కలెక్టర్ వివరించారు. ఈ సదవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. మరిన్ని వివరాలకు 94910 57527 నెంబర్ ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, డిఆర్ఓ కె.పద్మలత, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రోహిణి, జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ గంగాజి, నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

వారపు సంత వేలం పాట

ప్రజాశక్తి- అనంతగిరి:మండల కేంద్రంలో సోమవారం జరుగుతున్న సంత ఆశీలు వేలంపాట నిర్వహించారు. స్థానిక సర్పంచ్ సోమ్మెల. రూతు అధ్యక్షతన పంచాయతీ విస్తరణ అధికారి పి. ధర్మారావు సమక్షాన శుక్రవారం స్థానిక సచివాలయ కేంద్రంలో వేలంపాట కార్యక్రమం ఏర్పాటు చేశారు.వేలం పాటకి ఎవరు పోటి లేక పోవడంతో చిట్టంనాయిక్ వెంకటరావుకు వేలం పాట ఏకగ్రీవంగా పాడుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సెక్రటరీ సిహెచ్. దేవా, ఉప సర్పంచ్ పి .అర్జున్, పీసా కమిటీ సభ్యులు పాంగి. కొండలరావు, డి. దోనేష్ పాల్గొన్నారు



నాడెఫ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తడి, పొడి చెత్తతో సంపద

ప్రజాశక్తి అనంతగిరి:పంచాయతీ కేంద్రాలలో ఏర్పాటు చేసిన నాడెఫ్ సంపద కేంద్రాలలో తడి పొడి చెత్తను సేకరించి తద్వారా సంపదను తయారు చేయవచ్చునని పంచాయతీ విస్తరణ అధికారి.ధర్మారావు, స్థానిక ఎంపీడీవో ఏ వివి. కుమార్‌లు అన్నారు. శుక్రవారం ఎగువ శోభ పంచాయతీ పరిది మర్దగుడ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన నాడెఫ్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో సందర్శించారు. తడి చెత్తని బయట పార బోయ వద్దని, చిన్నపాటి ఫిట్ నాడెప్ లు ఏర్పాటు చేసి చేస్తారని, వాటిలో వేయాలని ప్రజలకు అవగాహన కల్పించాలని వారు కార్యదర్శులకు సూచించారు.

జన్‌మన్ ఇళ్లకు రూ.10 లక్షలు ఇవ్వాలి



నిరసన చేపడుతున్న గిరిజనులు, నాయకులు

ప్రజాశక్తి -హుకుంపేట:- పీఎం జన్ మాన్ పథకం లో పీవీటీజీ గిరిజనులకు మంజూరు చేస్తున్న ఇల్లు కు రూ 10 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చికుమద్దుల పంచాయతీ ముసిరిపాడు ఆందోళన చేపట్టారు. పెరిగిన సిమెంట్, ఊచలు, చిప్స్ ధరలకు ఈ సొమ్ము ఇల్లు పూర్తి చేయడానికి సరిపోన్నారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట మండల పరిషత్ వైస్ ఎంపీపీ, సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, పిఎం జన్మన్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న నిధులు మారుమూల గ్రామాల్లో ఇల్లు కట్టుకోవడానికి సరిపోలేదని ఆయన అన్నారు. మూడున్నర లక్షలతో ఇల్లు నిర్మించాలంటే భారం పడుతుందన్నారు. ప్రభుత్వం పునరాలసిన చేసి ఇల్లు నిర్మాణానికి డబ్బులు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, ముసిరి పాడు గ్రామస్థులు కొండతాబేలి ఆనంద్, రాయుడు, వార్డ్ మెంబర్ కొండతాబేలి సురేష్, కొండతాబేలి లచ్చన్న, సీదరి శ్రీను, వంతాల రామ్మూర్తి, సోమన్న, వంతాల రంగారావు, రూప, సత్యరావు, సుదేశ్, మహిళలు కొండతాబేలి లక్ష్మీ, సూర్య, కొండమ్మ, కొసాయి, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ భవనాన్ని అప్పగించాలని వినతి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:అరకులోయ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రెస్ క్లబ్ భవనం అప్పగించాలని అరకులోయ గిరిజన పాత్రికేయులు అల్లూరి జిల్లా కలెక్టర్‌కు శుక్రవారం పాడేరులో ప్రజాసమస్య పరిష్కార వేదికలో వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా గిరిజన పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా కలెక్టర్ కు వివరించారు.అరకు నియోజకవర్గ మండల కేంద్రంలోని పాత్రికేయులకు ప్రెస్ క్లబ్ భవనం గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు నిర్మించారని, దీనికి రెవెన్యూ అధికారులు కొంత స్థలం కేటాయించారన్నారు. ఈ కేటాయించిన స్థలంలో సుమారు 14 లక్షల రూపాయలతో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయంలో ఎమ్మెల్యే నిధులతో ప్రెస్ క్లబ్ భవనం నిర్మించి సుమారు పదేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ మీడియా పాత్రికేయులకు నూతన ప్రెస్ క్లబ్ భవనం అప్పగించ లేదన్నారు. దీంతో ప్రెస్ క్లబ్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. గుత్తేదారుడు భవనం నిర్మించి పదేళ్ల దాటుతున్నా భవనం ఎందుకు



అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు

అప్పగించలేని అడిగితే బకాయి బిల్లు చెల్లించలేదని అందుకే ప్రెస్ క్లబ్ భవనం తాళాలు ఇవ్వడం లేదని చెప్తున్నారని తెలిపారు. గుత్తేదారుడు కి రావలసిన బకాయి బిల్లు చెల్లించేలా చూడాలని గిరిజన ఇంజనీరింగ్ కోరారు.

పౌష్టికాహారంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పిఒ

ప్రజాశక్తి-చింతపల్లి

చింతపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలలో భాగంగా పోషణ పక్వాడ కార్యక్రమం చింతపల్లి సెక్టార్‌లోని సాయి నగర్ ఆంగన్‌వాడీ కేంద్రంలో అంగన్వాడి కార్యకర్త గడుతూరి రాశి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి జి వెంకటరమణి హాజరయ్యారు.శిశువు శారీరక, మానసిక అభివృద్ధికి పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. పిల్లల ఆరోగ్యం, పోషణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలియజేశారు. అనంతరం గర్భవతులకు సామూహిక సీమంతాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి ఎం రామలక్ష్మి, సూపర్వైజర్లు ఎస్.ఎస్.కె. గౌహరున్నిషా, కె. విజయకుమారి, ఆంగన్‌వాడీ కార్యకర్తలు వరలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బేకరీ స్వీట్ షాప్ దగ్ధం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక పోలీసుస్టేషన్ చినగంట్యాడ జగ్గు జంక్షన్ సమీపంలోని బెంగళూరు అయ్యంగర్ బేకరీ స్వీట్ షాప్‌లో గురువారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. పెదగంట్యాడ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పక్క దుకాణాలకు మంటలు వ్యాపించకుండా అరికట్టారు. ఈ ప్రమాదంలో బెంగళూరు అయ్యంగర్ బేకరీ స్వీట్ షాప్ మొత్తం దగ్ధమైంది. దాదాపు రూ.5 లక్షల నష్టం వాటిల్లినట్లు నిర్వాహకులు చెబుతున్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ మొస్య

చలివేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి- అనంతగిరి:ప్రముఖ పర్యాటక కేంద్రమైన అనంతగిరి రోడ్డు ప్రధాన కూడలిలో పలుచోట్ల చలివేంద్ర కేంద్రాలు ఏర్పాటు చేశారు. ములియగుడ బస్ స్టాప్ వద్ద స్థానిక సర్పంచ్ కిల్లో. మొస్య, కాశీపట్నం పంచాయతీ పరిధిలో సెక్రటరీ రామస్వామిలు చలివేంద్ర కేంద్రాలు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సార. దొన్ను, పీసా కమిటీ సభ్యులు టిడిపి, వైసిపి నాయకులు పాల్గొన్నారు

జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి

ప్రజాశక్తి -పాడేరు : ఈ నెల 20 నుండి 22వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రం కోటలో జరుగనున్న కుస్తీ పోటీలకు జిల్లా నుండి ఎంపికైన 16 మంది విద్యార్థులు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం ఐటిడిఎలో జరిగిన మీ కోసం కార్యక్రమం అనంతరం కొయ్యూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల పిడిలు నూకరాజు, సింహాచలం ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు 16 బంగారు పథకాలను, రెండు కాంస్య పథకాలను సాధించి కలెక్టర్ వద్ద ప్రదర్శించి కలెక్టర్ చేతుల మీదుగా పథకాలను పొందారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆ విద్యార్థులు జాతీయ స్థాయిలో కూడా బంగారు పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జేసి అభిషేక్ గౌడ, డిఆర్ఓ కె.పద్మ లత, కొయ్యూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాటశాల పిడిలు నూకరాజు, సింహాచలం పాల్గొన్నారు.

బిసి కార్పొరేషన్ ద్వారా మహిళలకు రుణాలు

ప్రజాశక్తి-పాడేరు: ఆడపిల్లలకు విద్య చాలా అవసరమని, ఆర్థిక అసమానతల్లో తేడాలు లేకుండా ఎదగాలంటే చిన్నతనం నుండే చదువు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి రాబోయే తరానికి ఆదర్శంగా ఉండాలని సూచించారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి పురస్కరించుకుని శుక్రవారం ఐటిడిఏలో జరిగిన ఒక కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి కింద 50శాతం బ్యాంకు రుణము, 50శాతం ప్రభుత్వం సబ్సిడీతో 150 యూనిట్లకు గాను 150 మంది మహిళా లబ్దిదారులకు నాలుగు కోట్ల రూపాయల చెక్కును కలెక్టర్ అందజేశారు. ఒక లక్ష నుండి రెండు లక్షల వరకు లబ్ది పొందినవారు వంద మంది రెండు లక్షల నుండి మూడు లక్షల వరకు లబ్ది పొందిన వారు 25 మంది మూడు లక్షల నుండి ఐదు లక్షల మధ్య లబ్ది పొందినవారు 25 మంది ఉన్నారని ఎల్ డి ఎం మాతు నాయుడు కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో జేసి అభిషేక్ గౌడ, డిఆర్ఓ కె. పద్మలత, ఎల్ డి ఎం మాతు నాయుడు, బిసి కార్పోరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో మారేడుమిల్లిలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయం, అనుబంధ శాఖలు కలిసి ప్రకృతి వ్యవసాయాన్ని రాబోయే ఐదు సంవత్సరాల్లో ఏ విధంగా అభివృద్ధి చేస్తారో చర్చించి ఒక యాక్షన్ ప్లాన్ తయారు చేశారు. మండలంలోని నాలుగు పంచాయతీల పరిధిలోని 11 గ్రామాల్లో ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్నట్లు తెలిపారు. తర్వాత మరో 3 పంచాయతీలకు విస్తరింపజేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీడీవో విశ్వనాథ శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి గొర్లె బాలాజీ బాబు, మారేడుమిల్లి సర్పంచ్ జాకబ్, మండల వ్యవసాయ అధికారి కె.వెంకటేశ్వర్లు, డివిజనల్ కోఆర్డినేటర్స్ కోవెల శ్రీనివాసరావు, గంగరాజు, గజేంద్ర, ప్రకృతి వ్యవసాయ, వ్యవసాయ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని దూసరపాము గ్రామ శివారులో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని లోదొడ్డి పంచాయతీ పాకవెల్తి గ్రామానికి చెందిన ముర్లా నాగేష్, గంగరాజు కాకరపాడు నుండి పాకి వైపు బైక్‌పై వెళ్తుండగా దూసర పాము గ్రామ శివారులో హైవేపై ఉన్న గేదెలను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. రెండు గేదెలు మృతిచెందాయి. క్షతగాత్రులను గ్రామస్తులు రాజవొమ్మంగి పిహెచ్సీకి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-రంపచోడవరం : రాజమహంద్రవరం రామకృష్ణ మిషన్ ఆధ్వర్యాన రంపచోడవరం మండలం, సిరిగిందల పాడులో గల రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆవరణలో ఈనెల 13న ఆదివారం ఉచిత వైద్య శిబిరం, కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద మహారాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయ వారు ఉచితంగా కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు, కళ్ళ జోళ్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. కంటి ఆపరేషన్లు (కాటరాక్ట్) అవసరమైన వారికి తమ ఆసుపత్రికి తరలించి శస్త్రచికిత్సలు చేస్తారని తెలిపారు. కంటి ఆపరేషన్లు నిమిత్తం వచ్చేవారు ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు తప్పనిసరిగా తీసుకుని రావాలని సూచించారు. ఈ వైద్య శిబిరాన్ని రోగులు సద్వినియోగ పరచుకోవాలని కోరారు.

జనన ధ్రువీకరణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లోని ప్రసూతి, గైనకాలజీ (ఒబిజివై) విభాగంలో జనన ధ్రువీకరణ కేంద్రాన్ని దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనన ధ్రువీకరణ పత్రాలను అతి తక్కువ సమయంలోనే పొందటానికి ఆధునిక పద్ధతిలో దీన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తదితరులు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా కెజిహెచ్ అధికారుల వ్యవహార శైలిపై బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఒక ప్రకటనలో మండిపడ్డారు. బాలల హక్కుల కమిషన్‌కు గౌరవం కల్పించడంలో విఫలమైన కెజిహెచ్ అధికారులపై నేషనల్ చైల్డ్ రైట్స్ కమిషన్‌కు, ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ధ్రువీకరణ కేంద్రం ప్రారంభానికి సంబంధించి తమకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదన్నారు.

అవిశ్వాసంపైనే కూటమి ఆశలు

గ్రేటర్ మేయర్ పీఠంపై సర్వత్రా చర్చ
ప్రపోజల్ కాపీపై కొనసాగుతున్న అభ్యంతరాలు
74 సంఖ్యే లక్ష్యంగా టిడిపి ముమ్మర యత్నాలు
కొనసాగుతున్న క్యాంపు రాజకీయాలు



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ నెల 19వ తేదీ కోసం జివిఎంసిలోని కూటమి పార్టీలు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నాయి. గ్రేటర్ విశాఖ మేయర్ పీఠాన్ని ఎలాగైనా దక్కించుకోవాలన్నదే ఆ పార్టీల లక్ష్యంగా ఉంది. అందులో భాగంగానే ఏప్రిల్ 2న జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేందిర ప్రసాద్‌ను కూటమి కార్పొరేటర్లు, నాయకులు కలిసి జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై అవిశ్వాస నోటీసు ఇచ్చారు. అప్పటి నుంచీ మేయర్ పీఠంపై సర్వత్రా చర్చ నడుస్తోంది. కార్పొరేషన్‌లో 74 మంది కార్పొరేటర్లు ఏ పార్టీ వైపు చేతులెత్తుతారో ఆ పార్టీకే మేయర్ పీఠం దక్కనుంది. ఆ సంఖ్యా కోసం టిడిపి పడరాని పాట్లు పడుతోందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ప్రస్తుతం 72 మంది వరకూ కార్పొరేటర్లు కూటమి గూట్లో ఉన్నట్లు సమాచారం. గడిచిన రెండు, మూడు రోజుల్లో మరో ఇద్దరు వైసిపి కార్పొరేటర్లను టిడిపి గాలం వేసి లాగేసిందన్న చర్చ సాగుతోంది. వారిలో గాజువాక, గోపాలపట్నం ఏరియాల కార్పొరేటర్లు ఉన్నట్టు సమాచారం. ఇదిలా వుండగా మరోవైపు క్యాంపు రాజకీయాల్లో కార్పొరేటర్లు సేదతీరుతున్నారు. వైసిపి కార్పొరేటర్లు బెంగళూరుకు వెళ్లారు. టిడిపి కార్పొరేటర్లు మలేషియా టూర్‌లో ఉన్నారు. టిడిపి నుంచి పీలా శ్రీనివాసరావు మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలని పావులు కదుపుతున్న సంగతి తెలిసిందే. దీంతో కూటమిలోని టిడిపికి ప్రధానంగా 19న ఏం జరుగబోతుందన్న ఆందోళన ఎక్కువైంది.

రూల్ పొజిషన్ ఏమిటి ?

ఓ వైపు క్యాంపు రాజకీయాలు నడుస్తుండగా అవిశ్వాసం ప్రతిపాదించేటప్పుడు పాటించాల్సిన (రూల్ పొజిషన్) పద్ధతిపై తాజాగా ఓ దుమారం తెరపైకి వచ్చింది. అది కూడా కూటమి భాగస్వామి పక్షమైన జనసేన నుంచే రావడం గమనార్హం. మున్సిపల్ చట్టం ఉల్లంఘన జరిగిందని జనసేన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తాజాగా జిల్లా కలెక్టర్‌కు లేఖ ద్వారా అభ్యంతరం తెలిపారు. అందులో 58 మంది సభ్యుల సంతకాల ఆధారాలు ఎక్కడా సమర్పించినట్టు తన దృష్టిలో లేదని పేర్కొనడంతో కూటమి కాస్త ఇరకాటంలో పడిందనే చెప్పొచ్చు. మేయర్ పీఠం కోసం కాచుకుని కూర్చొన్న వారు కొంతమంది కార్పొరేటర్ల ఇళ్లకు తిరిగి సంతకాలు పెట్టించుకునే తీరు వెల్లడవుతోంది. మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి వెళ్లే ముందు 58 మంది సభ్యులు ఒక చోట సమావేశం నిర్వహించి మినిట్స్ బుక్‌లో సంతకాలు పెట్టి ఆ కాపీ ఆధారంగా అవిశ్వాసం ఇవ్వాల్సి ఉండగా ఈ తరహాలో జరగకపోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

కార్పొరేషన్‌లో 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు అవిశ్వాస తీర్మానంలో పాల్గొనడం లేదని ఇప్పటికే వెల్లడించారు. నగర పౌరుల సమస్యలను పరిష్కరించే మార్గాలు కూటమి, వైసిపిల వద్ద లేవని ఆయన స్పష్టం చేశారు. పార్టీ విధాన నిర్ణయం ప్రకారం మేయర్‌పై అవిశ్వాసం కోసం జరిగే ఓటింగ్‌లో పాల్గొనడం లేదన్నారు. సిపిఐ కార్పొరేటర్ స్టాలిన్ 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ పార్టీ నిర్ణయమే తన నిర్ణయమని అన్నారు.

జిఎస్‌టితో పన్ను ఎగవేతలకు చెక్

కమిషనర్ పి.ఆనంద్‌కుమార్ వెల్లడి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జిఎస్‌టి అమలుతో పన్ను ఎగవేతదారులు తప్పించుకోలేని పరిస్థితులు దేశంలో నెలకొన్నాయని సిజిఎస్‌టి కమిషనర్ (ఆడిట్) పి.ఆనంద్ కుమార్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం విశాఖలోని పోర్టు ట్రస్ట్ సీ హార్స్ జంక్షన్ వద్దగల జిఎస్‌టి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టుకు నిధులు జిఎస్‌టి పక్కా అమలుతో సమకూరుతాయని తెలిపారు. జిఎస్‌టి వసూలు చేస్తున్న సందర్భంలో కొన్ని నకిలీ ఇన్వాయిస్‌లనూ పట్టుకుంటున్నామన్నారు. ఈ ఏడాది రూ.1500 కోట్లు నకిలీ ఇన్వాయిస్‌లను గుర్తించగా రూ.250 కోట్లను ఇప్పటి వరకూ వసూలు చేశామన్నారు. జిఎస్‌టి కౌన్సిల్‌లో ధరల రేషనలైజేషన్‌లపై చర్చలు జరుగుతున్నాయన్నారు. త్వరలో జిఎస్‌టి రేట్లు, పన్నుల స్లాబుల రేట్లు తగ్గే అవకాశం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సిజిఎస్‌టిలో 5 సర్కిల్స్ ఉన్నాయని, వాటిలో 28 గ్రూపుల ద్వారా 2024-25లో ఆడిట్ ద్వారా రూ.150 కోట్లు ఆదాయం తెచ్చామని అన్నారు. రాష్ట్రంలో సుమారు 60 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు ఉన్నారన్నారు.



మాట్లాడుతున్న ఆనంద్ కుమార్

ఇబ్బందుల్లో ప్రభుత్వ రంగ సంస్థలు

విశాఖ స్టీల్‌ప్లాంట్ గడిచిన కొన్నాళ్లుగా ఇబ్బందుల్లో ఉందని, హెచ్‌పిసిఎల్ పరిస్థితీ అలాగే ఉందని, ప్రభుత్వ రంగ సంస్థలు బలంగా ఉంటేనే జిఎస్‌టి కూడా కేంద్ర ప్రభుత్వానికి బాగా వస్తుందని ఆనంద్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా కియా మోటార్స్ ద్వారా జిఎస్‌టి ఆదాయం లభిస్తోందని అన్నారు. విశాఖలో ఆటోమొబైల్ ఇండస్ట్రీ ద్వారా జిఎస్‌టి చేకూరుతోందన్నారు. మరో ఏడాదిలో విశాఖలోగల సిజిఎస్‌టి భవన్‌ను అమరావతికి ప్రభుత్వం తరలిస్తుందని వెల్లడించారు. సమావేశంలో జిఎస్‌టి అధికారులు అరవింద్ దాస్, సత్యనారాయణ, రవి కిరణ్, వెంపర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధికారులు

2030 నాటికి మలేరియాను నిర్మూలించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలో 2030 నాటికి పూర్తిస్థాయిలో మలేరియాను నిర్మూలించే బాధ్యత మనందరిపైనా ఉందని జిల్లా మలేరియా అధికారి తులసి పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏజెన్సీలోని అన్ని పిహెచ్‌సిల వైద్యాధికారులు, డీఈఓ, వెలుగు ఎపిడి, ఎంపీడీవోలు, ఎంఇఓలు, సబ్ యూనిట్ అధికారులు, సిడిపిఓలు తదితరులతో మలేరియా నిర్మూలనపై శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి తులసి మాట్లాడుతూ 2030 నాటికి ఏజెన్సీలో మలేరియా నిర్మూలించే విధంగా ప్రతి గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జ్వరాలు ఉన్న వారికి రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో దోమతెరలు వాడే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఏజెన్సీలోని ప్రతి గ్రామంలో మురుగునీరు, చెత్తా చెదరం లేకుండా ఎక్కడికక్కడ పరిశుభ్రంగా ఉండే విధంగా పంచాయతీ కార్యదర్శులతో కోఆర్డినేషన్ చేయాలని సూచించారు. దోమల వృద్ధి చెందకుండా మలేరియా నివారణ మందు స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ వర్క్‌షాప్‌లో ఐటిడిఎ పిఓ కట్టా సింహాచలం మాట్లాడారు. కార్యక్రమంలో ఎడిఎంహెచ్ఒ పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం ఆపాలి

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : టూరిజం అభివృద్ధి పేరుతో గిరిజన ప్రాంతాలను కార్పొరేట్లకు అప్పజెప్పే ప్రయత్నాన్ని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే మానుకోవాలని ఆదివాసి జేఏసీ జిల్లా నాయకులు వంతు బాలకృష్ణ, పీసా కమిటీల మండల అధ్యక్షులు తాము సూరిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని నెల్లిమెట్ల గ్రామంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 9న రంపచోడవంలో ఐటిడిఎలో నిర్వహించిన వర్క్‌షాపులో టిడిపి ఎమ్మెల్యే, వైసిపి ఎమ్మెల్సీ, అధికార పార్టీ నాయకులతో మాట్లాడించి ఒక నోట్ తయారు చేసి విడుదల చేశారని, అభివృద్ధి, టూరిజం మాటున ఏజన్సీ ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపదను దోచుకోవడమే దీని వెనుకనున్న మర్మమని ఆరోపించారు. ఈ ప్రక్రియ రెండు మూడు నెలల నుంచి కొనసాగుతుందని, గతంలో శాసనసభ స్పీకర్ అయన్నపాత్రుడు 1/70 చట్టానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం, గత శాసన సభ సమావేశాల్లో టిడిపి ఎమ్మెల్యేతో గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులకు ఇళ్ల స్థలాలు కేటాయించాని కోరుతూ ప్రకటన చేయించడం, తాజాగా గిరిజన ప్రాంతాల్లో పర్యటించిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ టూరిజం ప్రోత్సహించాలని చేసిన వాఖ్యలు ఇందులో భాగమేనని పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆదివాసీ గిరిజన సంఘం ప్రతినిధులు ప్రభుత్వ చర్యలను తీవ్రంగా వ్యతిరేకించినట్లు చెప్పారు. గిరిజన సలహా మండలి ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలు, పీసా గ్రామసభలు నిర్వహించి గిరిజనుల అభిప్రాయలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నేతలు ఈక నాగరాజు, నైని సత్తిబాబు, బొరగా ప్రసన్నకుమార్, పూసం పండరీనాథ్ పాల్గొన్నారు.

విఆర్ఎల సమస్యలపై తహశీల్దారుకు వినతి

ప్రజాశక్తి-వై.రామవరం : విఆర్ఎల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన తహశీల్దారు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నైట్ డ్యూటీలు నిలుపుదల చేయాలని, ప్రమోషన్స్ ఇవ్వాలని, తెలంగాణ రాష్ట్రం వలె వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలని, డిఏను జీతంలో కలపాలని, వైసీపీ పాలనలో రికవరీ చేసిన డిఏను తిరిగి చెల్లించాలని, ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్మెన్, రికార్డ్ అసిస్టెంట్, డ్రైవర్ పోస్టులను వీఆర్ఏలతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సరిబోను, అక్కమ్మ, కయ్యం, చంద్రశేఖర్, వెలుగూరి, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.